News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :269 | ఖమ్మం | ఆదివారం నవంబర్ 9, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# నేటితో ముగియనున్న జూబ్లీహిల్స్ ప్రచారం..

## ముక్కోణపు పోటీలో విజేత ఎవరో !



- అభివృద్ధి అస్త్రంతో బరిలో నిలిచిన కాంగ్రెస్
- సెంటిమెంట్ పై ఆధారపడ్డ బీఆర్ఎస్
- సైలెంట్ ఓటుపై కమలనాథుల నజర్
- ప్రచారానికి మాజీ సీఎం కేసీఆర్ దూరం
- కనిపించని బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు

**హైదరాబాద్** :హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం మరో 24 గంటల్లో ముగియనుంది. ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11న ఇక్కడ పోలింగ్ జరగనుంది. రేపటితో (నవంబర్ 09) ప్రచార పర్వం పరిసమాప్తం కానుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పోటీపడుతున్నాయి. ముక్కోణపు పోటీలో ఓటరు మహాశయుడు ఎవరికి పట్టం కడతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ స్థానంలో గెలుపు, ఓటములపై రకరకాల ఊహాగానాలున్నాయి. సెఫాలజిస్టులు తిష్టవేసి రకరకాల సర్వే నివేదికలు ఇచ్చారు. ఒకరు బీఆర్ఎస్ గెలుస్తుందంటే.. మరొకరు కాంగ్రెస్ గెలుస్తుందనే నివేదికలు ఇచ్చారు. ఇవన్నీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతోంది. ఆ పార్టీ నుంచి నవీన్ యాదవ్ బరిలో నిలిచారు. నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతోపాటు గతంలో ఎంఐఎం తరఫున పోటీ చేసిన అనుభవం కూడా ఉంది. దీనికి తోడు అధికార పార్టీ కూడా కావడం మరో విశేషం. బీఆర్ఎస్ తరఫున దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పోటీలో ఉన్నారు. గోపీనాథ్ మృతి చెందడంతో సెంటిమెంట్ కలిసొస్తుందని కారు పార్టీ భావిస్తోంది. గోపీనాథ్ వరుసగా మూడు సార్లు అక్కడి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. దీంతో అక్కడి ప్రజలతో

వివరాలు 2లో..

## బీహార్‌కు తుపాకుల ప్రభుత్వం అక్కర్లేదు మోదీ



సీతామర్హి(బీహార్) : బీహార్ కు తుపాకుల ప్రభుత్వం అక్కర్లేదు అని మహాగట్బంధన్ ను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీహార్ రెండో దశ ఎన్నికలకు ముందు ప్రముఖ నేతలందరూ ఆ రాష్ట్రంలో వాలిపోయి హెూరా హెూరీగా ప్రచారం సాగిస్తున్నారు. మహాగట్బంధన్ కు మద్దతుగా శనివారం కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎ

వివరాలు 2లో..

## ప్రమాదం అంచున ఢిల్లీ.. 400 దాటిన ఇండెక్స్

### తారాస్థాయికి చేరుకున్న గాలి కాలుష్యం




న్యూ ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ లో గాలి కాలుష్యం తారాస్థాయికి చేరుకుంది. ఢిల్లీ రెడ్ జోన్ లోకి వెళ్లిపోయింది. ది డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ చెబుతున్న దాని ప్రకారం ఢిల్లీ లో గాలి నాణ్యత పడిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ఓ ప్రధాన

వివరాలు 2లో..

## రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలదే ఫెవికాల్ బంధం

- ఐదేళ్ల క్రితం ఈడీ కేసు నమోదైతే ఇప్పటికీ ఎందుకు అరెస్ట్ చేయలేదు?
- భాజపాతో వారిదే చీకటి ఒప్పందం
- భారాస సీనియర్ నేత హరీశ్‌రావు



రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలదే ఫెవికాల్ బంధమని భారాస సీనియర్ నేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఐదేళ్ల క్రితం రేవంత్‌పై ఈడీ కేసు నమోదు చేస్తే ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధాని ఆరోపించారని.., అయినా దీనిపై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. బిహార్‌కు డబ్బులు పంపుతున్నారని దిల్లీలోని గురుగ్రామ్‌లో ఉన్న భట్టి అత్తగారింట్లో ఐటీ తనిఖీలు జరిగాయని, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, చిప్‌లు తీసుకెళ్లారని.. ఇవి ఎందుకు బయటికి రాలేదన్నారు. గప్‌చుప్‌గా భాజపాతో ఏం చీకటి ఒప్పందం చేసుకున్నారని నిలదీశారు. మంత్రి పొంగులేటి ఇంట్లో తనిఖీలు చేసిన ఈడీ.. వివరాలు ఎందుకు వెల్లడించలేదన్నారు. భాజపాతో రహస్య ఒప్పందాలు రేవంత్‌రెడ్డివని, దిల్లీలో చీకట్లో ఎవరెవర్ని కలిసేది బయటికి వస్తూనే ఉందని, కానీ తమపై అభాండాలు మోపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది



- ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా అని కవిత ఫైర్
- కాలేజీ యాజమాన్యాల తాట తీస్తామనడం దారుణమని విమర్శ
- మాట తప్పింది మీరు, బంద్‌కు కారణమూ మీరేనని ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు.'జనం బాట'

వివరాలు 2లో..

## మహాత్మా గాంధీ పోరాటమే నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్‌లు చేస్తున్నాయి ప్రియాంక



కతిహార్, నవంబర్ 08: ఓట్లు చోరీ కి గురవుతున్న తరుణంలో మహాత్మా గాంధీ పోరాటం చేసినట్లుగానే కాంగ్రెస్, మహాగట్బంధన్ లు పౌరుల హక్కులు, ఓటు హక్కు కోసం పోరాటం చేస్తున్నాయి అని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. బీహార్ రెండో దశ ఎన్నికల ముందు బీహార్ లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. నేడు ప్రియాంక గాంధీ బీహార్ లో కతిహార్ లోని కద్వాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్ పోరాటం కేవలం

వివరాలు 2లో..


## భారాస, కాంగ్రెస్ మధ్యే పోటీ

### ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించండి: కేటీఆర్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రెండే పార్టీల మధ్య జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలను ఎగ్గొట్టి, పేదవాడి గూడు కూలగొట్టి, వాళ్ల నడుం విరగ్గొట్టి ఉపాధి లేకుండా చేస్తున్న కాంగ్రెస్‌కు... పేదవాడి కోసం ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తున్న భారాసకు మధ్య జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. భారాస కారుకి, కాంగ్రెస్ బుల్డోజర్ మధ్య జరుగుతున్న ఎన్నికని అభివర్ణించారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే

వివరాలు 2లో..





## రేవంత్ రెడ్డి ఒత్తిడిలో ఉన్నారు.. ఓటమి భయం కనిపిస్తోంది

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలు వేస్తారా అని ఆగ్రహం
- మీ స్నేహితుడు ఇంటికో ఉద్యోగమని ఇచ్చిన హామీ సాధ్యమైనా అని ప్రశ్న
- పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలన్న లక్ష్మణ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అందుకే బీజేపీపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డి మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు.ఇంటికో ఉద్యోగం అంటూ బీహార్‌లో మీ మిత్రుడు తేజస్వీ యాదవ్ హామీ

వివరాలు 2లో..

## లౌకిక పునాదులపై ఏర్పడిన పార్టీ కాంగ్రెస్

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

### 'జూబ్లీహిల్స్'లో అమాత్యుల ప్రచారం



కాంగ్రెస్ పార్టీ లౌకిక పునాదులపై ఏర్పడిందని.. సమాజంలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి క్రైస్తవ ప్రతినిధులు సమావేశం కావడం శుభపరిణామమన్నారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో

వివరాలు 2లో..

## నెయ్యి కల్తీ కేసులో సుబ్బారెడ్డి పాత్ర సీబీఐ



**అమరావతి, నవంబరు 08:** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో టీటీడీ అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉందని సీబీఐ ఆధ్వర్యం లోని సిట్ బృందం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కు తెలిపింది. ఈ నేపథ్యంలో లావాదేవీ లపై అనుమానం ఉంటే బ్యాంక్ ఖాతాల వివరాలు కోరవచ్చని తెలిపింది సిట్ బృందం. ఈ కేసులో దర్యాప్తును కొలిక్కి తీసుకువచ్చేందుకే సుబ్బారెడ్డి వివరాలు కోరుతున్నామని సిట్ బృందం హైకోర్టుకు నివేదించింది.

వివరాలు 2లో..

# లౌకిక పునాదులపై ఏర్పడిన పార్టీ కాంగ్రెస్

- మొదటి పేజి తరువాయి

శనివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో భట్టి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయానికి సహకరించాలని కోరారు. తమ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని అభ్యర్థించారు.

మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీలు విశ్వనాథన్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో మంత్రులు తుమ్మల, పొంగులేటి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, దామోదర్ రాజనర్సింహ తదితరులు ప్రచారం చేపట్టారు.

**సుస్థిర ప్రభుత్వం కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి: తుమ్మల**

హైదరాబాద్ అభివృద్ధి, సుస్థిర ప్రభుత్వం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఓటమి భయంతోనే భారాస అభ్యర్థి మాగంటి సునీతకు ఓట్లు వేయాలని కమ్మసంఘాలకు తాను చెప్పినట్లు ఫేక్ న్యూస్ సృష్టించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తోందని.. దీనిని తాను ఖండిస్తున్నానని చెప్పారు. భారాస హయాంలో కమ్మ సామాజిక వర్గాన్ని వేధించిన ఘటనలు మరచిపోలేదన్నారు. తెలుగుదేశం ఓట్ల కోసం భారాస కపట నాటకాలాడుతోందని.. వారిని ఎలా తిప్పికొట్టాలో పసుపు సైన్యానికి తెలుసని అన్నారు. ఆయన వెంట వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఉన్నారు. 'జూబ్లీహిల్స్' అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లోని కమలాపురి కాలనీ, శ్రీనగర్‌కాలనీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు మంజూరు చేశామని.. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఎర్రగడ్డలో పలువురు యువకులు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.

**జూబ్లీహిల్స్‌లో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు: పొంగులేటి**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సమీకృత గురుకుల పాఠశాలల పథకంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఒక పాఠశాల మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా, భారాసకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ప్రచారానికి ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉందని.. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# భారాస, కాంగ్రెస్ మధ్యే పోటీ

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్‌లో శనివారం నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. "ఎర్రగడ్డకు వచ్చి ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అడుగుతున్నారు. ఒక్క అవకాశం ఇచ్చినందుకే అన్ని వర్గాలను మోసం చేశారు. ఒక్కసారి మోసపోతే తప్పు వారిది. మళ్లీ మళ్లీ మోసపోతే తప్పు మనదవుతుంది. 420 హామీలు ఇచ్చి, దళితులు, బీసీలు, గిరిజన డిక్లరేషన్లు ప్రకటించి... ఒక్కటీ నెరవేర్చలేదు. భారాస అభ్యర్థి మాగంటి సునీతను గెలిపిస్తే, మా చేతికి తల్వార్ ఇస్తే.. ఎవరైనా పేదల ఇళ్లు కూలగొట్టడానికి వస్తే కొట్లాడతాం. హైడ్రా ఎప్పుడు ఏ గల్లీకి వచ్చి ఇళ్లు కూల్చేస్తుందో చెప్పలేం. కత్తి ఎవరికో ఇచ్చి మమ్మల్ని కొట్లాడమంటే కష్టం. హైడ్రా రాక్షసిని మేం ఊరికే వ్యతిరేకించటం లేదు. పేదల ఇళ్లు కూలగూడుతున్న హైడ్రా... పెద్దల ఇళ్ల జోలికి పోవడం లేదు. (ఈ సందర్భంగా జలాశయాల్లో కట్టారని ఆరోపిస్తూ సీఎం అన్న, మంత్రులు పొంగులేటి, వివేక్, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిల నివాసాల ఫొటోలను డిజిటల్ తెరలపై కేటీఆర్ చూపించారు.) హైదరాబాద్‌లో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టారు. రెండేళ్లయినా రేవంత్ ఒక్క ఇల్లు కట్టారా? జూబ్లీహిల్స్‌లో ఎన్ని రోడ్లు వేశారో, హైదరాబాద్‌లో ఎన్ని ఫ్లైఓవర్లు కట్టారో చెప్పాకే ఆయన ఓట్లడగాలి. ముస్లింలలో పేదలున్నారని కాంగ్రెస్ అంటోంది. దేశంలో అత్యధిక సార్లు అధికారం చెలాయించింది కాంగ్రెస్ పార్టీనే కదా... ఇన్నాళ్లు ఏం చేసింది? భారాస హయాంలో రాష్ట్రంలో 204 మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేశాం. షాదీముబారక్ అమలు చేశాం.

**కాంగ్రెస్ డబ్బులు ఇస్తే బాకీ పింఛను సొమ్ము ఎప్పుడిస్తారో అడగండి**

కాంగ్రెస్ పార్టీ షేక్‌పేటలో ఓటుకు రూ.5 వేలు, బోరబండలో రూ.6 వేలు, అభ్యర్థి ఉండే ప్రాంతం కావడంతో యూసుఫ్‌గూడలో ఓటుకు రూ.8 వేలు ఇస్తోంది. రూ.5 వేలు ఇస్తే బాకీపడిన పింఛను సొమ్ము రూ.55 వేలు ఎప్పుడు ఇస్తారని అడగండి. ఓట్లను నోట్లతో కొనుక్కొని భారాసను ఓడగొట్టాలని కాంగ్రెస్ నేతలు చూస్తున్నారు. బెదిరించి, ఇళ్లు కూలగొడతామని చెప్పి షరీఫ్ వంటి నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సంబరపడుతున్నారు. సర్వేలో ఓడిపోతుందని తెలియగానే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చింది. ఓడగొడితే కచ్చితంగా మహిళలకు రూ.2,500, పెద్దలకు రూ.4 వేల పింఛన్ వంటి హామీలు అమలవుతాయి. ఆకు రౌడీలు, గూండాల బెదిరింపులకు ఎవరూ భయపడవద్దు. కొందరు పోలీసులు అధికారం ఉందని ఎగిరెగిరి పడుతున్నారు. నఖరాలు చేస్తే తోక కత్తిరించే బాధ్యత తీసుకుంటాను" అని కేటీఆర్ అన్నారు.

**ఆడబిడ్డపై కేసులా?**

"మాగంటి గోపీనాథ్ ఎప్పుడు నిలబడినా మంచి మెజారిటీతో గెలిపించారు. ఆయన ఆశయాలతో వచ్చిన నాకు ఎక్కువ మెజారిటీ వచ్చేలా ప్రతిఒక్కరూ అండగా నిలవాలి. గడప గడపకు వెళ్తున్న నా పిల్లలపై, నాపై కూడా కేసులు పెట్టడాన్ని రాజకీయం అంటారా? బాధతో ఏడిస్తే దొంగ ఏడుపు అంటారా?" అని మాగంటి సునీత ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, కోనేరు కోనప్ప, క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సలీం, పార్టీ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ పోరాటమే నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్‌లు చేస్తున్నాయి ప్రియాంక

మొదటి పేజీ తరువాయి

రాజకీయ పోరాటం మాత్రమే కాదు. ఓటు హక్కుతో సహా పౌరుల ప్రాథమిక హక్కుల కోసం చేసే పోరాటం అని ఆమె అన్నారు. నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్ చేస్తున్న పోరాటం అప్పట్లో మహాత్మాగాంధీ చేసిన యుద్ధం లాంటిదే. మేము మీ హక్కుల కోసం, సత్యం కోసం ఒక సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాము. అదే నరేంద్ర మోదీ సామ్రాజ్యం ప్రజల్ని అణచివేస్తూ

దేశాన్ని నడుపుతున్నారు. ఆయన పార్టీ కూడా పుకార్లను వ్యాప్తి చేస్తుంది అని మోదీ ప్రభుత్వాన్ని ప్రియాంక విమర్శించారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య ప్రక్రియను బలహీనపరి చేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఈరోజు మహాత్మాగాంధీ పోరాడిన హక్కుల్లో ఒకటైన ఓటు హక్కు ప్రమాదంలో పడింది. బిజెపి రాజ్యాంగాన్ని బలహీనపరచడానికి తన శాయశక్తులా ప్రయత్నించింది. వారు ఓటును చోరీ చేయడం మొదలు పెట్టారు అని ప్రియాంక తీవ్రస్థాయిలో విమర్శించారు.

# ప్రమాదం అంచున ఢిల్లీ.. 400 దాటిన ఇండెక్స్

మొదటి పేజీ తరువాయి

కారణంగా నిలుస్తోంది. దాదాపు 30 శాతం గాలి కాలుష్యం పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్లే జరుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీ గాలి కాలుష్యంతో అల్లాడిపోతోంది. చలికాలం కావటంతో గాలి కాలుష్యం రోజు రోజుకు పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. శనివారం ఢిల్లీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. నగరం లోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 దాటింది. గాలి కాలుష్యం ప్రమాదక స్థాయిలకు చేరటంతో ఢిల్లీ రెడ్ జోన్ లోకి వెళ్లిపోయింది. దేశంలో అత్యంత గాలి కాలుష్యం కలిగిన సిటీల్లో ఒకటిగా నిలిచింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వివరాల ప్రకారం ఢిల్లీ లో సాయంత్రం 4 గంటల సమయంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 361గా ఉంది. దీంతో దేశ రాజధాని దేశం లోనే అత్యంత గాలి కాలుష్యం కలిగిన సిటీల్లో రెండవ

స్థానంలో నిలిచింది. సిటీ లోని కొన్ని ఏరియాల్లో గాలి కాలుష్యం చాలా దారుణమైన స్థాయిల్లో ఉంటోంది. వాజీపూర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 420 కి చేరింది. బురారిలో 418, వివేక్ విహార్‌లో 406, నెహ్రూ నార్‌లో 404, ఐటీఓలో 402 గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు అయింది. ఇక, శుక్రవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 322 గా ఉండింది. దేశ రాజధాని చుట్టు పక్కల ఉన్న సిటీల్లో కూడా గాలి నాణ్యత చాలా దారుణంగా ఉంది. నోయిడాలో 354, గ్రేటర్ నోయిడాలో 336, ఘజియాబాద్‌లో 339 గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు అయింది. ది డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ చెబుతున్న దాని ప్రకారం ఢిల్లీలో గాలి నాణ్యత పడిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ఓ ప్రధాన కారణంగా నిలుస్తోంది.

దాదాపు 30 శాతం గాలి కాలుష్యం పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్లే జరుగుతోంది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే వాహనాల కంటే పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్లే ఎక్కువగా గాలి కాలుష్యం జరుగుతోంది. ఒక్క శుక్రవారం రోజే పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో 290 పంట వ్యర్థాల దహనం ఘటనలు చోటుచేసుకున్నాయి.

# నెయ్యి కల్తీ కేసులో సుబ్బారెడ్డి పాత్ర సీబీఐ

మొదటి పేజీ తరువాయి

అయితే, తను, తన సతీమణి బ్యాంకు ఖాతాల వివరాలు కోరడాన్ని హైకోర్టులో టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి సవాల్ చేశారు. అయితే, ఈ విషయం పై కౌంటర్ దాఖలు చేసింది సిట్ బృందం. కొన్ని కంపెనీలు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేలినప్పటికీ సుబ్బారెడ్డి ఆయా కంపెనీల పై చర్యలు తీసుకోలేదని పేర్కొంది సిట్ బృందం. అయినా కూడా టీటీడీ కి కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు సుబ్బారెడ్డి ఆయా సంస్థలకు అనుమతి ఇచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరింది. ఈ కేసులో సుబ్బారెడ్డి లావాదేవీలనూ, అనుమానం వస్తే బ్యాంకు ఖాతాను కూడా పరిశీలించే అధికారం దర్యాప్తు అధికారికి ఉంటుందని సిట్ బృందం స్పష్టం చేసింది.

# బీహార్‌కు తుపాకుల ప్రభుత్వం అక్కర్లేదు మోదీ

మొదటి పేజీ తరువాయి

కూటమి కి మద్దతుగా ప్రధాని మోదీ సీతామర్హిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ మాకు కట్టా (తుపాకుల) ప్రభుత్వం వద్దు ఎన్‌డిఏ ప్రభుత్వమే మరోసారి కావాలని బీహార్ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మొదటి దశ ఓటింగ్ లో ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓటింగ్ సరళిని చూసి జంగిల్ రాజ్ కి 65 వోల్ట్ షాక్ కొట్టినట్లైంది అని మోదీ చురకలంటించారు.

# సీఎం రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరఫున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

# రేవంత్ రెడ్డి ఒత్తిడిలో ఉన్నారు.. ఓటమి భయం కనిపిస్తోంది

- మొదటి పేజి తరువాయి

ఇచ్చారని, ఏడు కోట్ల మంది ఉన్న ఆ రాష్ట్రంలో ఆ హామీ సాధ్యమేనా అని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెట్టాపట్టాలు వేసుకుని అధికారాన్ని పంచుకున్నాయని ఆయన ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. పాముకు పాలు పోసి పెంచినట్లు పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి అవకాశమిస్తే ఈరోజు విషనాగులా తయారైందని ఆయన విమర్శించారు.

# రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలదే ఫెవికాల్ బంధం

- మొదటి పేజి తరువాయి

కలిసి తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఎన్ని అడ్డదార్లు తొక్కినా.. ఫలించే సూచనలు కనిపించకపోవడంతో సీఎం అసహనంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడారన్నారు. రెండేళ్లలో చేసింది ఏమీలేదు కాబట్టే.. గత కాంగ్రెస్ పాలన చూసి ఓట్లేయాలని అడుగుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరంలోని మల్లన్నసాగర్‌ను వాడుకుంటూ భారాస హైదరాబాద్‌కు ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారని, హైదరాబాద్‌లో కేసీఆర్ పదేళ్లలో 43 ఫ్లైఓవర్లు, 153 విద్యుత్తు ఉపకేంద్రాలు, వ్యూహాత్మక నాలాల అభివృద్ధితో పాటు ఎన్నో పనులు చేశారన్నారు. రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చామని సీఎం చెబుతున్నారని... కానీ టీఎస్ఐపాస్ వెబ్‌సైట్‌లో 2024–25లో రూ.13,700 కోట్ల పెట్టుబడులు.., 2025–26లో రూ.6472 కోట్లు మాత్రమే వచ్చాయని ఉందన్నారు. నాడు ప్రగతిభవన్ కడితే విమర్శలు చేసి.. ఇప్పుడు ఎంసీహెచ్ఆర్‌డీలో సీఎం క్యాంప్ ఆఫీస్ కడుతున్నారన్నారు. రూ.30 కోట్ల అంచనాలు మూడు రెట్లు పెరిగి రూ.100 కోట్లకు చేరాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తానని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చి.. ఇప్పుడు కళాశాలల యాజమాన్యాలను బెదిరిస్తున్నారన్నారు. హరియాణా, మహారాష్ట్ర, బిహార్ ఎన్నికల సమయంలో పెద్ద కాంట్రాక్టర్లకు ఇచ్చిన బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు.

# నేటితో ముగియనున్న జూబ్లీహిల్స్ ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

ఆ కుటుంబానికి సంబంధాలున్నాయి. ఇదిలా ఉండగా బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో నిలిచారు. ఆయన సైలెంట్ ఓటు ను నమ్ముకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు చెబుతున్నారు. దీపక్ రెడ్డి గతంలో ఇక్కడ పోటీ చేసి 25 వేల పైచిలుకు ఓట్లు పొందారు. ఈ ముగ్గురిలో విజేత ఎవరన్నది ఈ నెల 11న ఓటరు నిర్ణయించనున్నాడు.

**కానరాని కేసీఆర్**

స్టార్ క్యాంపెయినర్లుగా పేర్కొన్న బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఈ ఎన్నికల్ ప్రచారంలో పాల్గొనలేదు. అదే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరును బీజేపీ పేర్కొన్నప్పటికీ ఇక్కడికి వచ్చి ఆమె ప్రచారం చేయలేదు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, తేజస్వీ సూర్య, అన్నామలై, పురంధేశ్వరి తదితరులు ఎవరూ జూబ్లీహిల్స్ కు వచ్చి ప్రచారం చేయలేదు.

**పోలింగ్ శాతం పెరిగేనా?**

జూబ్లీహిల్స్ ఓటర్లు 4,01,365 మందిగా తేలారు. అందులో 2,08,561 మం ది పురుషులు, 1,92,779 మంది మహిళలు, 25 మంది ఇతరులు ఉన్నారు. 139 పోలింగ్ స్టేషన్‌లలో 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో కనీసం 986 మంది ఓటర్లున్నారు. 1200 మంది ఓటర్లకు పైగా 11 పోలింగ్ కేంద్రాలుండగా అత్యల్పంగా 263 పోలింగ్ స్టేషన్‌లో 540 మంది ఓటర్లు.. అత్యధికంగా 9 వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో 1233 మంది ఓటర్లున్నారు. ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ యాభై శాతానికి కొంచం అటు ఇటుగా పోలింగ్ నమోదవుతోంది. ఈ సారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

## ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని నిరసన.

● బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 8.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి మూసి అభివృద్ధి, బ్రిడ్జి నిర్మాణం, భీమలింగేశ్వర అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని . నిరసన కార్యక్రమం చేపట్టిన మండల అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్ సమక్షంలో
భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు పురస్కరించుకొని మూసీ నది ఒడ్డున ఉన్న భీమలింగేశ్వర స్వామిని దర్శించుకుని బీమలింగేశ్వర స్వామి అభివృద్ధికి, మూసి ప్రక్షాళకు, మూసి వంతెన ఎత్తు పెంచుట గురించి హామీ ఇచ్చి ఇప్పటివరకు సంవత్సరం గడిచిన ఎలాంటి పనులు ప్రారంభించినందుకు గాను బిజెపి మండల శాఖ అధ్యక్షులు శ్రీ బోల్ల సుదర్శన్ ఆధ్వర్యంలో మహా నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీ ఉట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీ పాశం భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ.

గత ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామానికి విచ్చేసి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ఏడాది గడిచిన ఆ హామీలకు అతిగతి లేదని వారు తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి భీమలింగేశ్వర స్వామి ఇచ్చిన హామీలను కలలో కనిపించి నెరవేర్చే విధంగా తగిన బుద్ధి చెప్పాలని భీమ లింగేశ్వర స్వామికి పాలాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తక్షణమే హామీలను నెరవేర్చకుంటే రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్త ఉద్యమానికి కార్యరూపం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు కొప్పుల యాదిరెడ్డి, కాదూరి అచ్చయ్య, రాష్ట్ర నాయకులు ఏల చంద్రశేఖర్ , భువనగిరి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పకీర్ రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, కనతాల అశోక్ రెడ్డి, మంద నరసింహ ముదిరాజ్ , కందుల తానేష గౌడ్, రామ నర్సు, మాజీ ఉప సర్పంచ్ మత్స్యగిరి, వివిధ మండలాల అధ్యక్షులు సురేష్ రెడ్డి, సదానందం గౌడ్, రవీందర్ రెడ్డి, బిజెపి మండల నాయకులు లోడే లింగస్వామి గౌడ్, నాగరాజు, వెంకటేశం, రంజిత్ రెడ్డి, మహేష్, మత్స్యగిరి, నరేందర్ రెడ్డి, శశికాంత్, సైదుల్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, నరసింహ, రమేష్, దానయ్య, సందీప్ వివిధ మండలాల, గ్రామాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

● జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు.






**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 8.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు మండలంలోని సంగెం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా భీమలింగం వద్ద శ్రీ భీమలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు రాబోయే కాలంలో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం, మండల నాయకులు జిల్లా నాయకులు, జక్క జంగారెడ్డి బద్ధం సంజీవరెడ్డి బత్తిని సహదేవ్ చిలుగురి సత్తిరెడ్డి బత్తిని వరుణ్ గౌడ్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసొల్ల ప్రవీణ్ కుమార్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి సయ్యద్ అనిల్ సత్యనారాయణ పబ్బు శివ దశరథ వంశీ రవి విన్ను నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి శిక్షణకు 11 మంది ఎంపిక.

**జిల్లా కలెక్టర్ జితేశ్ వీ. పాటిల్**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 08,** భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఎస్ -20 గదిలో ఒరియెంటేషన్ మరియు ఎంపిక పరీక్ష నిర్వహించారు. డ్రాయింగ్ టెస్ట్ మరియు ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా లిమూడు నెలల రెసిడెన్షియల్ మల్టీపర్పస్ అసిస్టెంట్ - ఫర్నిచర్ ప్రొడక్షన్ అండ్ ఇన్‌స్టాలేషన్ కోర్సుకు అభ్యర్థులను ఎంపిక చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేశ్ వీ. పాటిల్ యువత ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని నైపుణ్యంతో ముందుకు సాగాలని సూచించారు.
రాజమండ్రిలో సోమవారం ప్రారంభమయ్యే ఈ శిక్షణ కోసం మొత్తం 11 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు.
శిక్షణ పొందనున్న వారికి కల్పించే సదుపాయాలు: ప్రతి అభ్యర్థికి 5,000 రిజిస్ట్రేషన్ ఫీజు ను జిల్లా యంత్రాంగం భరిస్తుంది. వసతి మరియు భోజనం పూర్తిగా ఉచితంగా కల్పించబడుతుంది.
శిక్షణ పూర్తయ్యిన తర్వాత 15,000/- నెల వేతనంతో 6 నెలల అప్రెంటిస్‌షిప్ అవకాశం ఉంటుంది, అనంతరం 100% ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.
ఎన్ ఎఫ్ టి ఐ బి ఎఫ్ ఎఫ్ ఎస్ సి ఆధ్వర్యంలో జరిగిన మొదటి విడతలో 8 మంది శిక్షణ పూర్తి చేసి ప్రస్తుతం అప్రెంటిస్‌షిప్‌లో ఉన్నారు. రెండవ విడతలో 19 మంది అభ్యర్థులు ఇప్పటికే ఎంపికయ్యారు.
జిల్లా యువత ఈ శిక్షణ అవకాశాన్ని ఉత్సాహంగా వినియోగించుకుంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వెంకయ్య ఏపీఎం, సైదేశ్, ఈడియం, దిలీప్, నందు, ర్యాంపు కోఆర్డినేటర్స్, జేఆర్పీలు తదితరులు పాల్గొన్నారు


## ట్రాక్టర్, బైక్ ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలు



**నవంబర్ 08 (సి కే న్యూస్) చేగుంట :** చేగుంట శివారులోని జీవిక పరిశ్రమ సమీపంలో శనివారం నాడు చోటుచేస్తుంది. స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..
చేగుంట మండలంలోని కరీంనగర్ గ్రామానికి చెందిన చాకలి భూమేష్ చేగుంట నుండి స్వగ్రామం వెళ్తుండగా మార్గ మధ్యలో జీవక పరిశ్రమ వద్ద ఎదురుగా వస్తున్న టాక్టర్ ఢీకొనడంతో భూపేష్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.
స్థానికులు వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ లొ తూప్రాన్ ప్రభుత్వ
ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు,అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ లోని గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఎలికట్ట శ్రీ అంబాభవాని మాతకు అభిషేకం

**అభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యాలరాజు ఆధ్వర్యంలో**



**సి కే న్యూస్ షాద్ నగర్:నవంబర్ 8:** శ్రీ శ్రీ శ్రీ అంబాభవాని మాత దేవాలయం ఎలికట్ట గ్రామంలో ప్రతి శుక్రవారం జరిగే అభిషేకంలో భాగంగా దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యాలరాజు ఆధ్వర్యంలో ఎలికట్ట గ్రామ వాస్తవ్యులు మేడిపల్లి యాదయ్య దంపతులు అభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నారం వెంకట్రాంరెడ్డి మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## పేరెంట్స్ శక్తితో విద్యార్థుల స్వప్నాలు సాకారం సాధ్యం



**ఇండియన్ హైట్స్ పాఠశాలలో పేరెంట్స్ సమావేశం**

ఇండియన్ హైట్స్ పాఠశాలలో (NURTURING DREAMS THROUGH PARENTAL) కార్యక్రమం

**సి కే న్యూస్ షాద్ నగర్:నవంబర్ 8:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను చాటి చెప్పేలా("%చీఖ=ఖ=×చీ+ ణ=జూామీూ ఎఎ=ాఖ+ఎ ాూ=జుచీూాూ%")పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ భువనేశ్వర్, ద్రాక్షాయణి ఆధ్వర్యం వహించగా డైరెక్టర్లు మహేష్, జగదీశ్వర్ సమన్వయ బాధ్యతలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సైకాలజిస్ట్ మరియు బిహేవియర్ స్కిల్స్ కోచ్ సుధీర్ సంద్ర తల్లిదండ్రులకు విద్యార్థుల మానసికాభివృద్ధి, ఆత్మవిశ్వాసం మరియు సానుకూల ఆలోచనల ప్రాధాన్యం గురించి వివరించారు.
వారు మాట్లాడుతూ... గురువులు జ్ఞానదాతలు మాత్రమే కాదు.జీవన శిల్పులు.పాఠ్యాంశాలు నేర్పడం కాకుండా, పిల్లల మనసులో ఆత్మవిశ్వాసం, ధైర్యం, సృజనాత్మకత నింపడం వారి ధర్మం. బలహీనతలను గుర్తించి బలాలను పెంచుతారు. తల్లిదండ్రులతో సమాన బాధ్యత పంచుకుంటారు.ఇంట్లో తల్లిదండ్రులు ప్రేమతో మార్గదర్శకులైతే, పాఠశాలలో గురువులు శిస్తుతో, సానుకూలతతో దిశానిర్దేశం చేస్తారు. ఈ రెండు శక్తుల సమ్మేళనంలోనే విద్యార్థి సమగ్ర వికాసం సాకారమవుతుంది.గురువులు పిల్లల్లో కలలు నాటుతారు, పెంచుతారు, నిజం చేస్తారు. ఒక మంచి గురువు ఒక విద్యార్థిని మాత్రమే కాదు.మంచి పౌరుడిని,నాయకుడిని,సమాజ సేవకుడిని తీర్చిదిద్దుతాడు.పిల్లలకు మొబైల్స్‌కు చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా జాగ్రత్తపడాలి.మొబైల్స్ వాడకంలో అధిక సమయం కేటాయించడం వారి దృష్టి, జ్ఞాపకశక్తి, ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తల్లిదండ్రులు మొబైల్స్‌ను పిల్లలకు దూరంగా ఉంచి, వారికి సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు.అదే సమయంలో సుధీర్ తల్లిదండ్రులకు ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా వ్యవహరించాలని, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి ఎదుగుదల కోసం ప్రణాళికాబద్ధంగా నడిపించాలని సూచించారు.పిల్లలపై ఒత్తిడి కాకుండా, ప్రోత్సాహం చూపించండి. చిన్న విజయాలను కూడా గుర్తించి ప్రశంసించండి. అది వారి జీవిత దిశను మార్చేస్తుందని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఎక్సలెన్స్, ఫన్ లెర్నింగ్ టెక్నిక్స్, కెరీర్ గైడెన్స్, గోల్ సెట్టింగ్, మోటివేషన్, క్రియేటివ్ థింకింగ్ వంటి అంశాలపై సవివరంగా చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా చైర్మన్ భువనేశ్వర్, ద్రాక్షాయణి మాట్లాడుతూ...ఇండియన్ హైట్స్‌లో విద్యార్థుల విద్యతో పాటు విలువల పెంపు కూడా మా ప్రధాన లక్ష్యం. తల్లిదండ్రుల భాగస్వామ్యం ద్వారా పిల్లలలో నైపుణ్యాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు.తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పాఠశాల కార్యక్రమాలకు తమ మద్దతు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ విశ్వేశ్వర్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ హైట్స్ పాఠశాల విద్యతో విలువలు, క్రమశిక్షణతో భవిష్యత్తు నిర్మాణానికి ఆలయమని యాజమాన్యం స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, మోటివేషన్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు ప్రజల మనిషి అందరివాడు అందరి కోసం ఉంటాడు అందరితో ఉంటాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు




**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**

సకలజనుల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి గౌరవ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
మీ జన్నాయికోడె నగేష్
తాజా మాజీ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఆత్మకూర్ (ఎం)

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ఖమ్మం జిల్లా పార్లమెంటు సభ్యులు శ్రీ రామ సహాయం రఘురాం రెడ్డి సిఫార్సు మేరకు చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన కీ.శే పెంట్యాల సైదేశ్వర రావు కి మంజూరైన 175000 /మరియు 160000
ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారి ఇంటి దగ్గరకు వెళ్లి శ్రీ పెంట్యాల సైదేశ్వర రావు సతీమణి అయిన పెంట్యాల నాగేంద్రమ్మ కి మరియు వారి కుమారుడైన శ్రీ పెంట్యాల నాగులు మీరా కి శ్రీనన్న సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గుడిపూడి రజినీకాంత్ అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

# సామినేని రామారావు హత్య దర్యాప్తు లో పోలీసుల వైఫల్యం..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇందుకు భాధ్యత వహించేల్సిందే..
- రామారావు ను చంపిన వారిని సోషల్ బాయ్ కట్ చేయాలి..
- ప్రపంచం అంతా ఎర్రజెండా వైపు చూస్తుంది.
- సీపీఎం అగ్ర నేతల ధ్వజం.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని: –సిపిఎం సీనియర్ నేత చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును చంపిన హంతకులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం ఉందని సిపిఎం నేతలు ధ్వజమెత్తారు. సామినేని రామారావు సంతాపసభ శనివారం పాతర్లపాడు గ్రామంలో జరిగింది. ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు , సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం , సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ , సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, తదితరులు కాంగ్రెస్ పార్టీ వారే తమ నేతను హత్య చేశారని ఆరోపణలు చేశారు .రామారావుది రాజకీయ హత్య కాదంటున్న పోలీస్ కమిషనర్ మరి హంతకులు ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారూ. ఆయన రాజకీయ నాయకుడి లా మాట్లాడుతున్నాడు , కాంగ్రెస్ అంటే ప్రేమ ఉంటె కాకి చొక్కాలు వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరాలని హితవు పలికారు. చనిపోయిన రామారావు భార్య స్వయంగా పోలీసులకు ఫలానా ,ఫలానా వాళ్ళు తన భర్త హత్యకు కారణమని లిఖితపూర్వకంగా రాసి ఇస్తే వాటి మీద చర్యలు తీసుకోకుండా ఆమెను కుటుంబసభ్యులను వేధిస్తున్నారని ఇదెక్కడి న్యాయం భాదితులకు అండగా ఉండాల్సిన పోలీసులు కాంగ్రెస్ కు వత్తాసు పలకడం ఏమిటని నిలదీశారు %ా%అవసరమైతే పోలీసుల తీరుపై ప్రవేటు కంప్లైంట్ వేస్తామని రామారావు కుమారుడు విజయ్ సభ ముఖంగా పోలీసులకు హెచ్చరికలు చేశారు %ా

%సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ ,ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే ,ఇక్కడ రామారావు ఉండగా తమ ఆటలు సాగవని భావించిన ప్రత్యర్థులు ఆయన్ను అడ్డు తొలగించుకునేందుకు దారుణంగా హత్య చేశారని అన్నారు%ా%కొంతమంది ఆగంతకులు గొంతు కోసి చంపడం అదికూడా తెల్లవారుతుండగా చంపాడమంటే అత్యంత ప్రణాళిక ప్రకారం జరిపారని అన్నారు.. ఈ హత్యను పొలిట్ బ్యూరో కూడా ఖండించింది తెలిపారు ..మృదు స్వభావి శత్రువుతో సహితం మర్యాదగా మాట్లాడే రామారావు దుర్మార్గంగా పొట్టన పెట్టుకున్న దుండగులను పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు చేశారు ..ప్రత్యర్థులు ఏ రాజకీయ కక్షతో హత్య చేశారో , అదే రాజకీయ కక్షతో దెబ్బకొట్టాలని రాఘవులు పిలుపు నిచ్చారు ..రాష్ట్రంలో హెూమ్ శాఖ కూడా సీఎం రేవంత్ రెడ్డి వద్దనే ఉందని , ఇక భట్టి డిప్యూటీ సీఎం గా ఉన్నారని ఇదే జిల్లాకు చెందిన పొంగులేటి కోటరీలో సభ్యుడుగా ఉన్నారని ధ్వజమెత్తారు%ా% హత్య జరిగి 9 రోజులు గడుస్తున్నా చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వమా ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు ..భట్టి విక్రమార్క అదే రోజు హత్యను ఖండిస్తూ ప్రకటన చేశారు హంతకులను పెట్టుకోకుండా ప్రకటనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు ..ప్రజల కోసం పనిచేసే వాళ్ళు కమ్యూనిస్టులు అయితే ..దోచుకునే వాళ్ళు కాంగ్రెస్ వాళ్ళు అని %ా%మనం వాళ్ళను ప్రజల్లోనే ఎండగట్టాలని అన్నారు..







సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవి కుమార్ ,పాలడుగు భాస్కర్ ,సిపిఎం ఖమ్మం ,కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్న నాగేశ్వరావు , మచ్చా వెంకటేశ్వర్లు , సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిజమ్ముల జితేందర్ రెడ్డి ,న్యూడెమోక్రసీ నాయకులు మధు సిపిఎం నాయకులు,పి. సోమయ్య , బుగ్గవీటి సరళ , రామారావు సతీమణి సామ్రాజ్యం ,కూతురు , కోడలు , సిపిఎం జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు , విక్రమ్ , కనకయ్య , కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు %ా%సభకు సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మదుపల్లి గోపాల్ రావు అధ్యక్షత వహించారు ..

## మాజీ సర్పంచ్ సామినేనిరామారావు చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించిన బిజెపి నాయకులు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

గత కొద్ది రోజుల క్రితం సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు, పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు ని గుండాల చేత అతికిరాతకంగా హత్యకు గురి కాబడ్డారు. సామినేని రామారావు దశదిన కార్యక్రమం ఆహ్వానం మేరకు వారి స్వగ్రామం పాతర్లపాడు గ్రామంలో వారి ఇంటి వద్ద సామినేని రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొండా గోపి, బూత్ అధ్యక్షులు బల్లి పిచ్చారావు, కిలారి నరసింహారావు వడ్డెబోయిన నాగయ్య, మంద గోవింద్, షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.




## కబ్జాకు గురైన పార్కు స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు..

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, సి కే న్యూస్:** ఆదిభట్లలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న మున్సిపల్ అధికారులు బుధవారం అక్కడ ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో, శ్రీమిత్ర కాలనీలోని ఓపెన్ స్థలాన్ని కొందరు అక్రమార్కులు కబ్జా చేసి ప్రహరీ, గది నిర్మించిన విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే అధికారులు స్పందించి "ప్రభుత్వ భూమి ం పార్కు స్థలం" అని స్పష్టంగా సూచించే బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కబ్జా నుంచి విముక్తి కల్పించి స్థలాన్ని రక్షించడం మున్సిపల్ సంస్థ బాధ్యత అని ఆయన తెలిపారు. బోర్డు ఏర్పాటు కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.




## ఎమ్మిగనూరులో ఘనంగా శ్రీ భక్త కనకదాసు జయంతి

**భక్తకనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..**

**కురువ సంఘం నాయకులు.**

**ఎమ్మిగనూరు సి కే న్యూస్ ,నవంబర్ 08,** ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎమ్మిగనూరు కురువ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్రకోట హంపయ్య, వీరనాగప్ప, ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సీనియర్ అసిస్టెంట్ కే మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులు కేటీ ఉరుకుందు, జిల్లా ప్రచార కార్యదర్శి బోడబండ నరసింహులు కోరారు. శనివారం పట్టణంలోని కురువ కమ్యూనిటీ హాల్ లో శ్రీ భక్త కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. భక్త కనకదాసు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన భక్తితో శ్రీకృష్ణ పరమాత్ముడినే ప్రసన్నం చేసుకున్నాడన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో కురువలు అధిక సంఖ్యలో ఉన్నారని, కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసి కురవలకు కోరిక ను నెరవేర్చాలి. కార్యక్రమంలో మసీదుపురం అంజినయ్య, మెకానిక్ భీరప్ప, వెంకటాపురం సత్యన్న, బోడబండ కడివేళ్ల హనుమంతు, యాదగిరి, కలుగొట్ల వీరనాగప్ప, గార్లదిన్నె పరమేష్, చెన్నాపురం కేజి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ తరలిస్తున్న వాహనాలు పై కేసు నమోదు.

**నాతవరం సి కే న్యూస్**



అక్రమంగా మైనింగ్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశామని నాతవరం ఎస్సై వై. తారకేశ్వర రావు తెలిపారు దీనికి సంబంధించి ఎస్సై అందించిన వివరాలు ఇలా ఉన్నాయి నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ ఇసుకను నిల్వ ఉంచి జెసిబి ట్రాక్టర్ తో అక్రమంగా రవాణా చేస్తున్నారని రెవెన్యూ అధికారులు సమాచారం మేరకు నాతవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ కు సన్మానం.



**నాతవరం సి కే న్యూస్** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అయిన తరువాత మొట్టమొదటి సారిగా నాతవరం మండలం విచ్చేసిన

రాష్ట్ర అధ్యక్షులు పీ వి న్ మాధవ్ ని మండల అధ్యక్షులు సబ్బి కుమారస్వామి సన్మానించారు. ఈ సందర్భంగా

మాధవ్ మాట్లాడుతూ గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి పని చెయ్యాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గడప గడపకు తీసుకొని వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు గాదె శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, డాక్టర్ సత్యనారాయణ,బోలెం శివ, నర్సీపట్నం మండల కన్వీనర్ బోలెం దొర రూరల్ కన్వీనర్ శ్రీనివాస్ గవిరెడ్డి త్రినాథ్ లాలం వెంకటరమణ కుదిరెడ్డి శివాజీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తుని నర్సీపట్నం రోడ్డు పై జంగిల్ తొలగించిన ఎస్సై.



**నాతవరం/అనకాపల్లి సి కే న్యూస్** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు ఆధ్వర్యంలోఇటీవల మోటార్ సైకిళ్లకు సంభవిస్తున్న వరుస ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలను నివారించేందుకు నాతవరం నుంచి తాండవ జంక్షన్ వరకు మరియు ములగపూడి నుంచి గన్నవరంకి మెట్ట వరకు (తునీ–నర్సీపట్నం ప్రధాన రహదారి) పొదలు, మొక్కలు, ఆకులు తొలగించే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ చర్య ద్వారా రోడ్డు పక్కలకు అడ్డుగా పెరిగిన మొక్కలు, పొదలు తొలగించబడటంతో రహదారి సౌకర్యంగా మారి, వాహనదారులకు స్పష్టమైన దృశ్యం కనిపించేలా మారింది. రాత్రి సమయంలో కూడా ప్రమాదాలు జరగకుండా ఈ చర్య సహాయపడుతుందని భావిస్తున్నారు. రోడ్డు భద్రత కోసం ప్రజలు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్లు ధరించాలని, అతివేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగాసేవా కార్యక్రమాల్లో ముందుండాలి - డిఆర్ఓ వై. సత్యనారాయణరావు



**అనకాపల్లి నవంబర్ 8 సి కే న్యూస్** అనకాపల్లిలో రెడ్‌క్రాస్ కొత్త జిల్లా కమిటీ ఏర్పాటులి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనకాపల్లి జిల్లా కమిటీ వార్షిక సర్వ సభ్య సమావేశం శనివారం సాయంత్రంఐఐ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా రెడ్‌క్రాస్ శాఖ చైర్మన్ సి. బాలసతీష్ ఆధ్వర్యంలో కొత్త కమిటీని ఏఎర్పాటు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు సమక్షంలో నిర్వహించారు. అనకాపల్లి జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా డాక్టర్ గ్రంధి శేషు కుమార్, వైస్ చైర్మన్‌గా పి. సురేశ్వర్‌రావు, ట్రెజరర్‌గా పి. కృష్ణం రాజు ఎన్నికయ్యార

సమావేశంలో గత సంవత్సరంలో చేపట్టిన రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు, యువ రెడ్‌క్రాస్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించబడింది. రాబోయే సంవత్సరానికి ప్రణాళికలు, సేవా కార్యక్రమాల విస్తరణపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సమాజానికి అండగా నిలిచే సేవా సంస్థ అని , అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన సాయాన్ని అందించడం ప్రతి సభ్యుడి బాధ్యతగా ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. (కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచి పారిశ్రామికవేత్తను కోల్పోవడం బాధాకరం యార్లగడ్డ







**గన్నవరం, సి కే న్యూస్** విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న మంచి పారిశ్రామికవేత్త ముక్కామల సురేంద్ర బాబు ఆకస్మిక మరణం బాధాకరమని ఆయన లేని లోటు పారిశ్రామిక రంగానికి తెలుగుదేశం పార్టీకి తీర్చలేనిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన సురేంద్రబాబు సంస్మరణ సభ శనివారం ఉదయం గన్నవరం లోని ఏపీ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణం రాజు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కామినేని శ్రీనివాస్ లతో కలిసి ఎమ్మెల్యే వెంకట్రావ్ సురేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ కుగ్రామం నుంచి వచ్చి పారిశ్రామిక రంగంలో చెరగని ముద్ర వేసిన సురేంద్ర బాబు చిరస్మరణీయుడు అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూరంగా ఉన్న పారిశ్రామికవేత్తలతో సహా అనేకమంది అధికారం వచ్చిన వెంటనే మేము మీ పార్టీ అంటూ అధికార పార్టీ వైపు రావడం సహజంగా చూస్తుంటామని కానీ సురేంద్ర బాబు 2024 ఎన్నికల్లో తనకు బహిరంగ మద్దతు ప్రకటించి తన విజయం కోసం ఎంతగానో కష్టపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయనకు ఏదైనా అవసరమైతే ఫోన్లో చెప్పమన్నా చెప్పకుండా నేరుగా వచ్చి కలిసి మాట్లాడటం ఆయన సంస్కారానికి నిదర్శనంగా యార్లగడ్డ పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే సురేంద్ర బాబు లేరన్న నిజాన్ని జీర్ణించు కోలేక పోతున్నామని, సురేంద్ర బాబు ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ

# పనుల్లో పొరపాటు వల్ల కేజీహెచ్ లో విద్యుత్ అంతరాయం

- ఇది కేజీహెచ్ యాజమాన్యం, ప్రభుత్వ వైఫల్యం కాదు
- వాస్తవాలు తెలుసుకొని స్టేట్మెంట్లు ఇవ్వాలి
- క్రిటికల్ కేర్ వద్ద వాటర్ పనులు చేస్తుండగా తెగిన విద్యుత్ కేబుల్ లైన్లు
- ఎమర్జెన్సీ యూనిట్లకు ఐదు జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా
- సీరియస్ కండిషన్లో వచ్చిన దేవి అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది.
- ఆమె మృతికి విద్యుత్ పోవడానికి సంబంధం లేదు ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, సి కే న్యూస్ నవంబర్ 08:** ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రధాయని కింగ్ జార్జ్ ఆసుపత్రి పై దుష్ప్రచారాలు చేస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. కేజీహెచ్ లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి, రోగులు ఇబ్బందులు పడ్డారని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు ఆయన తీవ్రంగా స్పందించారు. కేజీహెచ్ క్రిటికల్ వార్డు వద్ద వాటర్ పైప్ లైన్ ముందుకు జరిపే పనులు కోసం గోతులు తీస్తుండగా జెసిబి బకెట్ తగిలి కిందనున్న విద్యుత్ కేబుల్ లైన్లు తెగిపోయాయని తెలిపారు. దీనివలన మధ్యాహ్నం రెండు నుంచి విద్యుత్ సరఫరా కొన్ని యూనిట్లకు నిలిచిపోయిందని వివరించారు. కేజీహెచ్ యాజమాన్యం వెంటనే స్పందించి వాటర్ పనులు చేస్తున్న ఏపీఎంఎస్ఐ డిసి నిర్వాహకులకు తెలియజేశారు. అలాగే విద్యుత్ శాఖ ఎస్ఈ, డిఈ ఏఈలకు సమాచారమిచ్చి రిపేర్లు చేయమని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ కేబుల్ లైన్లు రిపేరు చేసే పనులను చేపట్టారు.



ఈలోగా కేజీహెచ్ లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ ఉండేందుకు సిబ్బంది అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ వార్డులకు ఐదు జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాని అందించారు. రాత్రి రెండు గంటల సమయంలో విద్యుత్ కేబుల్ రిపేర్లు పూర్తి చేసి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. దీనివలన కేజీహెచ్ లో చికిత్స తీసుకుంటున్న రోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దేవి అనే మహిళ సీరియస్ కండిషన్లో ఆసుపత్రిలో చేరిందని తెలిపారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందిందే తప్ప, విద్యుత్తు లేనందున మృతి చెందలేదని తెలియజేశారు. వాస్తవాలు తెలుసు కోకుండా వైసిపి నాయకులు నోటికి వచ్చినట్లు స్టేట్మెంట్లు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ముందుగా ఏం జరిగిందో తెలుసుకొని మాట్లాడాలని లేదంటే జఫ్ఫాలు అయిపోతారని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికే వైసిపిని రాష్ట్ర ప్రజలు గంగలో కలిపేసారని గుర్తు చేశారు. ఇలాంటి పనికిమాలిన అసత్య ఆరోపణలు చేస్తూ రోడ్లెక్కితే 11 సీట్లు కూడా రావని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. వాటర్ పనులు వల్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ప్రభుత్వ వైఫల్యం అంటూ ప్రభుత్వం పై బురద చల్లుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో భ్రష్టు పట్టించిన కేజీహెచ్ ను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయడం ఓర్వలేకే తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నాలకు దిగుతున్నారన్నారు. వైద్య, విద్యకు కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతినిస్తుందని అందులో ఎలాంటి సందేహము లేదని వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు. పనికిమాలిన రాజకీయాలతో అప్రతిష్ట పాలు కావద్దని వైసీపీ నేతలకు హితవు పలికారు.

# ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మెడికల్ కాలేజీలు ప్రవేటికరణ





- ప్రజా ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి వ్యవహరిస్తోంది..
- కేజీహెచ్ లో 12గంటలు కరెంటు లేక రోగులు నానఇబ్బందులు పడ్డారు..
- వై.యస్.ఆర్.సి.పి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు.

**విశాఖపట్నం, సి కే న్యూస్ నవంబర్ 08:** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రవేటికరణకు వ్యతిరేకంగా నవంబర్-12 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలకు సంబంధించి వై.యస్.ఆర్.సి.పి ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో జరిగింది.

ఈసందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దొంగ దెబ్బ కొట్టే విధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజిలను ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేసే విధంగా ప్రజాభిప్రాయం లేకుండా ఒక కుట్రపూరిత నిర్ణయం కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు.

ప్రజాభి ప్రాయానికి వ్యతిరేకంగా ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన రెడ్డి ఆదేశాల మేరకు గత 40 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు కరణకు వ్యతిరేకంగా శాంతియుత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ ఉద్యమంలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మహా ఉధృతంగా జరుగుతుందని అన్నారు. నాడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్య, వైద్య రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కార్యక్రమాలు, సంస్కరణలు, ఒక సువర్ణ అధ్యాయమని విద్య, వైద్య రంగంలో పేదవారు ఆరోగ్యానికి సంపూర్ణ భద్రత కల్పిస్తూ ఆరోజు జగన్ అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. అటువంటి కార్యక్రమాలు అన్నింటిని నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తూ దొంగ దెబ్బ కొట్టే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. దీనికి ఉదాహరణగా ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని అయిన కేజీహెచ్ లో సుమారు 12 గంటలకు పైగా కరెంటు లేకుండా రోగులు, రోగులు బంధువులు ఇబ్బంది పడుతున్న కనీసం పట్టించుకునే నాథుడే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, నియోజకవర్గ పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రాష్ట్ర నాయకులు, జిల్లా కమిటీ, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు, జిల్లా, నియోజకవర్గ, అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ లో ఇండియా హెబిటాట్ సెంటర్ సందర్శన



**విశాఖపట్నం, సి కే న్యూస్ :** ఢిల్లీ లో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రాతినిధ్యం వహించిన విఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ కె రమేష్ తమ పర్యటన లో భాగంగా శనివారం ఢిల్లీ లో పేరొందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్ ను సందర్శించారు. విశాఖ లో విఎంఆర్డిఏ నేతృత్వంలో సుమారు 8.8 ఎకరాల స్థలంలో పీపీపీ విధానంలో ఇండియా హ్యాబిటెట్ సెంటర్ తరహాలో ఈస్ట్ కోస్ట్ హ్యాబిటెట్ సెంటర్ ను నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు చేశారు. ఇందులో భాగంగా ఢిల్లీలో ఇండియా హ్యాబిటెట్ సెంటర్ ను పరిశీలించారు. ఇండియా హ్యాబిటెట్ సెంటర్ జిఎం అమర్నాథ్ ను కలిసి, ఇండియా హెబిటాట్ సెంటర్ నిర్మాణ శైలి, కన్వెన్షన్ సెంటర్లు, మీటింగ్ హాల్స్, కార్యాలయాలు, పచ్చదనం పెంపు, హొటల్స్, సదస్సులు ఏర్పాటు చేసుకునేందుకు తగిన సదుపాయాలు, వసతి తదితర అంశాల పై సెంటర్ జిఎం అమర్నాథ్ తో చర్చించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ లో హ్యాబిటెట్ సెంటర్ నిర్మాణ అవశ్యకత ను వివరించారు.

## రెడ్ క్రాస్ జిల్లా కమిటీ వార్షిక సమావేశం.




**అనకాపల్లి, సి కే న్యూస్ నవంబర్ 08:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా రెడ్‌క్రాస్ శాఖ చైర్మన్ సి. బాలసతీష్ ఆధ్వర్యంలో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు సమక్షంలో నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా డాక్టర్ గ్రంధి శేషు కుమార్, వైస్ చైర్మన్‌గా పి. సురేశ్వర్‌రావు, ట్రెజరర్‌గా పి. కృష్ణం రాజు ఎన్నికయ్యారు. సమావేశంలో గత సంవత్సరంలో చేపట్టిన రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు, యువ రెడ్‌క్రాస్ కార్యకలాపాల పై సమీక్ష నిర్వహించబడింది. రాబోయే సంవత్సరానికి ప్రణాళికలు, సేవా కార్యక్రమాల విస్తరణ పై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సమాజానికి అండగా నిలిచే సేవా సంస్థ అని , అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన సాయాన్ని అందించడం ప్రతి సభ్యుడి బాధ్యతగా ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.
కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్త కనకదాసు గొప్ప భక్త కవి, సంగీతకారుడు

- కనకదాసు జీవితం ఆదర్శనీయం
- జయంతి వేడుకలులో ఎమ్మెల్యే బివి.

**సి కే న్యూస్ ఎమ్మిగనూరు టౌన్, నవంబర్ 08,** భక్త కనకదాస జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంతి వేడుకలను పురస్కరించుకొని భక్త కనకదాసు చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భక్త కనకదాసు గొప్ప భక్త కవి, సంగీతకారుడు, తత్వవేత్త అని తెలిపారు. భక్త కనకదాసు తన కీర్తనలు , రచనలు ద్వారా సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు కృషి చేయడతో పాటు, సాక్ష్యాత్తు దైవాన్నే తన వైపు తిప్పుకున్నారన్నారు. అలాంటి మహానీయుని జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండువగా నిర్వహించడం ఆనందకరమన్నారు.

## రైతు సంఘం జిల్లా కౌన్సిల్ ను జయప్రదం చేయండి

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పిలుపు




**సి కే న్యూస్ ఎమ్మిగనూరు,నవంబర్ 08,** ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. అలాగే ఆదోని పట్టణంలో నవంబర్ 18,19 వ తేదీల్లో జరిగే పత్తి రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని కూడా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మేళనానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తో రాష్ట్ర నాయకులు పాల్గొంటారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం,సీపీఐ నాయకులు కేసి జబ్బార్,ఆంజనేయ,బీపీ వెంకటేష్,రంగన్న,భాస్కర్ యాదవ్,రాజీవ్, విరూపాక్షి నాయుడు,నరసింహులు,మల్లికార్జున గౌడ్,నాగరాజు పాల్గొన్నారు.

# అభివృద్ధిపైనే ఆశలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టారు. విడిపోయి నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ఏడు పదులు దాటిన వయసులోనూ చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎవరూ కాదనలేరు. పెట్టుబడుల కోసం ఒక ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని విదేశాల చుట్టూ తిరగడం ఒక్క చంద్రబాబు విషయంలోనే చూస్తున్నాం. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తనకంటూ రాజకీయాల్లో ఒక మార్క్ ను క్రియేట్ చేసుకోవాలని పడుతున్న తపన స్పష్టంగా కనపడుతుంది. అందుకే వయసును, అలసటను లెక్క చేయకుండా ఆయన పనిచేస్తున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం చంద్రబాబు పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో జరిగిన పొరపాట్లను కూడా గుర్తించడం లేదని కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కేవలం అభివృద్ధి సంక్షేమం తమను మరొకసారి అధికారంలోకి తెస్తుందన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం అందుకు విరుద్ధంగా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పోస్టు చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. 1999లో రెండోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైబరాబాద్ ను అభివృద్ధిని చేసినప్పటికీ 2004 ఎన్నికల్లో దాని చుట్టు పక్కల పరిధిలో ఉన్న యాభై శాసనసభ నియోజకవర్గాల్లో రాజేంద్ర నగర్ నియోజకవర్గం మినహా మరే చోట టీడీపీ గెలవలేకపోవడాన్ని ఈ సందర్భంగా కార్యకర్తలు గుర్తు చేస్తున్నా 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి అమరావతితో పాటు అనంతపురంలో కియా పరిశ్రమను తెచ్చారని, కానీ అమరావతి చుట్టు పక్కలతో పాటు, అనంతపురంలో కియా పరిశ్రమను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పార్టీ పూర్తిగా 2019 ఎన్నికల్లో చతికలపడటానానికి గల కారణాలను కూడా గుర్తుంచుకోవాలని మరికొందరు కోరుతున్నారు. గతంలో కంటే ఈసారి కాస్త భిన్నంగా చంద్రబాబు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో తీసుకెళుతున్నా వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు టీడీపీకి అనుకూలంగా ఉంటాయన్న గ్యారంటీ ఉందా? అని కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు వాస్తవంలోకి వచ్చి కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాలని కోరుతున్నారు.

# పొలిటికల్ టర్న్ తీసుకున్న డ్రగ్స్ కేసు



విశాఖలో చోటుచేసుకున్న డ్రగ్స్ కేసు ఇప్పుడు రాజకీయ మలుపు తిరుగుతోంది. ఈ కేసులో వైసీపీ స్టూడెంట్ వింగ్ నాయకుడు కొండారెడ్డి అరెస్టు వివాదాస్పదంగా మారింది. పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని చెబుతుండగా, వైసీపీ మాత్రం దీనిని ప్రభుత్వ కుట్రగా పేర్కొంటోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీసు వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆరోపణల ప్రకారం.. కొండారెడ్డిని ఉదయం 7 గంటల సమయంలోనే పోలీసులు అరెస్టు చేశారని, అయితే కేసు నమోదు మాత్రం సాయంత్రం 4.30కి చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై వైసీపీ అనుమానం వ్యక్తం చేస్తోంది. పార్టీ నాయకులు పలు వీడియోలు, టైమ్ స్టాంపులు ఆధారంగా చూపిస్తూ.. అరెస్టు సాయంత్రం జరిగిందని పోలీసులు చెబుతుంటే, ఉదయం 11.30 గంటలకు టీడీపీ అధికారిక సోషల్ మీడియా పేజీలో అరెస్ట్ ఫోటోలు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. కొండారెడ్డి అరెస్టు అనంతరం ఆయనను సమీపంలోని టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (మూడే కిలోమీటర్ల దూరంలో)కి తీసుకెళ్లకుండా.. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో స్థలానికి తీసుకెళ్లారని వైసీపీ ఆరోపిస్తోంది. ఆ టైమ్‌లో కొండారెడ్డి ఎక్కడ ఉన్నారు? ఎవరిని కలిశారు? ఎవరైనా ఒత్తిడి చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అరెస్టు అనంతరం కొండారెడ్డి మీడియా ముందు కన్నీళ్లతో మాట్లాడుతూ.. నా కొడుకును నిర్దోషిగా లాక్కెళ్లి, ప్రైవేట్ పార్ట్స్‌పై కొట్టి బలవంతంగా నేరాన్ని ఒప్పించారని ఆరోపించారు. డ్రగ్స్ కేసుతో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే ఏ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఈ ఘటనను రాజకీయంగా ప్రేరేపిత అరెస్టుగా పేర్కొంటూ.. హోమ్ మినిస్టర్ కేవలం జగన్‌ని విమర్శించడానికే ఉన్నారు. ప్రజల భద్రత గురించి పట్టించుకోవడం లేదు అని వైసీపీ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.. ఇక వైసీపీ మహిళా నాయకులు కూడా హోమ్ మినిస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఎన్సీఆర్బీ రిపోర్టు ప్రకారం, అమ్మాయిల మిస్సింగ్ కేసులు రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఆమె ఏ హోమ్ కి మినిస్టర్ అంటూ వైసీపీ విమర్శలు గుప్పించారు. కొండారెడ్డి అరెస్టు వ్యవహారంలో వైసీపీ వీడియోలు బయట పెట్టడంతో డైలమాలో కూటమి ప్రభుత్వం పడిందని విమర్శించారు.

# యాక్టివ్ పాలిటిక్స్ లో ధర్మాన



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన ఓటమి నుంచి చేరుకోవడానికి ఏడాదికి పైగా పట్టింది. అయితే ఒకే ఒక షరతుతో ఆయన పార్టీలో యాక్టివ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. సుదీర్ఘకాలం ఉమ్మడి ఏపీలో రాజకీయాలు చేశారు ధర్మాన ప్రసాదరావు. అయితే గత ఎన్నికల్లో ఒక సామాన్య సర్పంచి చేతిలో ఓడిపోయారు. అది మొదలు తీవ్ర నైరాస్యంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్నఫళంగా యాక్టివ్ అయ్యారు. దీంతో రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆది నుంచి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆయన భిన్న వైఖరి అనుసరిస్తూ వచ్చారు. ఒకానొక దశలో పార్టీకి దూరమవుతారని ప్రచారం నడిచింది. కానీ కూటమిలో ఆప్షన్ లేకపోవడంతోనే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకధాటిగా 12 సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు పైగా రెవెన్యూ లాంటి కీలక శాఖ బాధ్యతలను చూశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్ మంత్రిగా ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2014 లో గత్యంతరం లేని స్థితిలో ఆయన జగన్ చెంతకు వెళ్లారు. అయినా ఓటమి పలకరించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న వేవ్ దృష్ట్యా చాలా యాక్టివ్ గా పని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి ఖాయమని అంచనా వేశారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు. సోదరుడు కృష్ణదాస్కు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపంతో మూడేళ్లపాటు గడిపారు. దీంతో విస్తరణలో ధర్మాన ప్రసాదరావు కు ఛాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే జగన్ విషయంలో విభిన్న వైఖరితో ఉన్న ధర్మాన మంత్రిగా తన మార్కు చూపించుకోలేకపోయారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయేసరికి జగన్ నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు రాలేదు కూడా. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు. అయితే ఈ యాక్టివ్ వెనుక కుమారుడు రామ్ మనోహర్ నాయుడు భవితవ్యం ఉన్నట్లు తేలుతోంది. 2024 ఎన్నికల్లోనే తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని కోరారు ధర్మాన ప్రసాదరావు. అందుకు జగన్ అంగీకరించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి గెలుపు కష్టం అన్న ఆలోచనకు వచ్చారు. పార్టీ ఆవిర్భవించి మూడుసార్లు ఎన్నికలు జరిగితే ఒకసారి మాత్రమే గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో టిడిపి అభ్యర్థి 52,000 ఓట్ల తేడాతో గెలిచారు. అంటే ఏ స్థాయిలో ఇక్కడ తెలుగుదేశం అనుకూల వాతావరణం ఉందో గ్రహించారు ధర్మాన ప్రసాదరావు. అందుకే టిడిపి తో పాటు కూటమి పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. అది వర్కౌట్ కాకపోవడంతో వైసీపీలో కొనసాగుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. అయితే ధర్మాన ప్రసాదరావు విషయంలో పార్టీ హైకమాండ్ అల్టిమేట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కొనసాగుతారా? లేదా? లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోమంటారా? అని గట్టిగానే కోరినట్లు తెలుస్తోంది. అప్పుడే ధర్మాన ప్రసాదరావు ఒక షరతు పెట్టినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు టికెట్ ఇస్తే పార్టీలో యాక్టివ్ అవుతానని ధర్మాన ప్రసాదరావు చెప్పినట్లు తెలుస్తోంది. అధినేత జగన్మోహన్ రెడ్డి అంగీకరించడంతోనే ధర్మాన యాక్టివ్ అయినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

### పల్టీ కొట్టి బోల్తా పడ్డ ఇన్నోవా

## ప్రయాణికులు సురక్షితం

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ప్రమాద ధాటికి ఇంజన్ లో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఎనిమిది మంది ప్రయాణికులు ఇన్నోవా నుంచి సురక్షితంగా బయటపడ్డారు. వాహనం రోడ్డుకు అడ్డం పడడంతో హైదరాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది..

## విద్యార్థులపై దూసుకెళ్లిన కారు.. ముగ్గురు మృతి

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం దగ్గర హైవేపై కారు బీభత్సం సృష్టించింది. బస్టాప్లో వేచివున్న విద్యార్థులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఫ్రంట్ టైరు పేలడంతో కారు అదుపుతప్పి విద్యార్థులపైకి దూసుకెళ్లింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## ఎలన్ మస్క్ కు 88 లక్షల కోట్లు ప్యాకేజీ




మనదేశంలో అత్యధిక వేతనాలు తీసుకొనే ప్రైవేట్ కంపెనీల అధినేతలలో ముకేశ్ అంబానీ, కావేరి మారన్, రోషిణి నాడార్, ఆనంద్ మహీంద్రా ముందు వరసలో ఉంటారు. వీరి వార్షిక వేతనం కోట్లల్లో ఉంటుంది. ప్రతి ఏడాది వీరి వేతనం పెరుగుతూనే ఉంది. పెరిగిన వేతనం ద్వారా వీరు రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు.. కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త ఘనతలను అందుకుంటునే ఉన్నారు. మన దేశం గురించి కాస్త పక్కన పెడితే.. ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్.టెస్లా.. ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా.. ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్. ఇంకా తన వ్యాపారాలను మరింత స్థాయికి విస్తరించడానికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్లా కార్ల విక్రయాల ద్వారా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. అటువంటి మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం లోకి కూడా అడుగు పెట్టారు. త్వరలోనే భారతదేశంలో సేవలు అందించబోతున్నారు. దీనికి సంబంధించి అనుమతులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో మస్క్ మరో రికార్డు సృష్టించారు. కార్పొరేట్ ప్రపంచం కనీ విని ఎరుగని ఘనతను ఆయన అందుకున్నాడు. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ తరఫున ప్రచారం చేశాడు మస్క్. ట్రంప్ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర కూడా పోషించాడు. ఆ తర్వాత ఆ స్థానం నుంచి తప్పుకున్నాడు. ట్రంప్ తో తనకు విభేదాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ట్రంప్ తో స్నేహం ముగిసిన అధ్యాయమని మస్క్ వెల్లడించాడు.. ఇక ఇప్పుడు మస్క్ కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాడు. ఆయనకు వన్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి టెస్లా కంపెనీకి చెందిన 75 శాతం షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. వన్ ట్రిలియన్ డాలర్లు అంటే దాదాపు 88 లక్షల కోట్లు. ఫలితంగా కార్పొరేట్ ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఆయన చరిత్ర సృష్టించాడు. అయితే మస్త్ నెల జీతం గా కాకుండా.. ఆ మొత్తాన్ని వచ్చే పది సంవత్సరాలలో స్టాక్స్ రూపంలో ఆయన పొందుతారు. ప్రస్తుతం 476 బిలియన్ డాలర్ల సంపద తో మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్నాడు.

## బెంగళూరు వర్సెస్ హైదరాబాద్ ఓఆర్ఆర్, హైటెక్స్..

బెంగళూరు, హైదరాబాద్ మధ్య తేడాలు, పోలికలు సర్వసాధారణమే. దేశంలో, మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో టాప్ నగరాలైన ఈ రెండింటి మధ్య సోషల్ మీడియాలో నెటిజన్లు తరచూ చర్చలు జరుపుతూనే ఉంటారు. అయితే ఇప్పుడు వారి దృష్టి రెండు నగరాల ఔటర్ రింగ్ రోడ్లపై పడింది. ఈ క్రమంలోనే ఓ నెటిజన్.. బెంగళూరు ఓఆర్ఆర్, హైదరాబాద్ ఓఆర్ఆర్‌ల మధ్య తేడాలను వివరిస్తూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశంలో సిలికాన్ వ్యాలీ సిటీగా బెంగళూరు.. ఐటీ రాజధానిగా హైదరాబాద్.. దేనికదే చాలా ప్రత్యేకం. ఇక ఐటీ విషయంలో రెండు నగరాలు పోటాపోటీగా ఉంటాయి. గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇక రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు.. పలు అంశాలపై నువ్వా నేనా అన్నట్లు మాటల యుద్ధాలు సాగించేవి. అయితే రెండు నగరాల్లో ఉండే వారు కూడా.. అక్కడ, ఇక్కడ పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, ట్రాఫిక్ గురించి.. సోషల్ మీడియా వేదికగా తరచూ చర్చ జరుపుతూనే ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్, బెంగళూరు నగరాల మధ్య సరికొత్త చర్చ నడుస్తోంది. భారతదేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాలైన హైదరాబాద్, బెంగళూరు మధ్య ఇప్పుడు సోషల్ మీడియాలో ఔటర్ రింగ్ రోడ్ల పోలికపై పెద్ద చర్చ నడుస్తోంది. ఒక ఎక్స్ యూజర్ చేసిన పోస్ట్‌లో.. బెంగళూరులో ఉన్న దారుణమైన ట్రాఫిక్, రోడ్ల సమస్యలను ప్రస్తావిస్తూ.. హైదరాబాద్ ఓఆర్ఆర్ ఎంత మెరుగ్గా ఉందో చూపించడంతో ఈ చర్చ ప్రారంభమైంది. హైదరాబాద్ ఓఆర్ఆర్.. 8 లేన్లు, గుంతలు లేని రోడ్లు, స్పష్టమైన లేన్ మార్కింగ్‌లు, అత్యుత్తమ నిర్వహణ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. అదే సమయంలో బెంగళూరు ఓఆర్ఆర్ గురించి ప్రస్తావిస్తూ.. సరైన లేన్ మార్కింగ్‌లు లేకపోవడం, గుంతలతో కూడిన రోడ్లు, రోడ్ల ఉపరితలాలు సరిగా లేకపోవడం, అపరిశుభ్రత వంటి సమస్యలు ఉన్నాయని చెప్పడం గమనార్హం. ఇక ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. చాలా మంది నెటిజన్లు హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను దేశంలోనే 'బెస్ట్ ప్లాన్డ్ ఎక్స్‌ప్రెస్ వే'గా ప్రశంసలు గుప్పిస్తున్నారు. బెంగళూరు అధికారులు త్వరగా సమస్యను పరిష్కరించి 'సిలికాన్ సిటీ'కి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ గురించి.. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతున్న వేళ.. ఈ పోస్ట్ మరింత అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ క్రమంలోనే ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఫోటోలు, పోలిక ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఇక బెంగళూరులో ఉన్న పరిస్థితులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన ఆ నెటిజన్.. తాను బెంగళూరు నగరాన్ని ద్వేషించడం లేదని స్పష్టం చేశారు. కానీ తమ బెంగళూరు నగరంలో ఉన్న అత్యంత దారుణమైన మౌలిక సదుపాయాల గురించి.. ఆ రోడ్లపై ప్రయాణించి ప్రజలు ఎంత అలసిపోతున్నారో మాత్రమే చెబుతున్నానని పేర్కొన్నారు. 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి 'సిలికాన్ సిటీ'కి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నానంటూ ఆ యూజర్ పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు వేలాదిగా నెటిజన్ల నుంచి రియాక్షన్లు వచ్చాయి. చాలా మంది యూజర్లు హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.

## పేటీఎం, ఫోన్ పే లాంటి యాప్స్‌లో డిజిటల్ గోల్డ్ కొంటున్నారా..? అయితే SEBI హెచ్చరిక మీకే..




దేశంలో ప్రస్తుతం డిజిటల్ గోల్డ్ తెగ ప్రజాధరణ పొందుతోంది. తక్కువ పెట్టుబడులతో రోజూ ఇన్వెస్ట్ చేసేందుకు వీలు ఉండటంతో చాలా మంది ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ తాజాగా హెచ్చరిక జారీ చేసింది. ఆన్‌లైన్‌లో కేవలం రూ.10తోనే బంగారం కొనుగోలు చేయగలమని ఆకర్షణీయంగా ప్రచారం చేస్తున్న అనేక ప్లాట్‌ఫార్మ్‌లతో పెట్టుబడిదారులకు ప్రమాదకరమని సెబీ స్పష్టం చేసింది.ప్రస్తుతం పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లు "డిజిటల్ గోల్డ్", "ఇ - గోల్డ్" పేరుతో పెట్టుబడులను తీసుకుంటున్నాయి. అయితే ఇవి సెక్యూరిటీస్ చట్టాల పరిధిలోకి రావని, వస్తు డెరివేటివ్స్‌గానూ గుర్తింపు పొందలేదని పేర్కొంది. ఈ ఉత్పత్తులపై ఎలాంటి నియంత్రణలు లేకపోవడం వల్ల పెట్టుబడిదారులు పెద్ద ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్పత్తులు పూర్తిగా సెబీ పర్యవేక్షణలో లేవని, కనుక వీటిలో పెట్టుబడి పెట్టే వారికి సెక్యూరిటీస్ మార్కెట్‌లో లభించే రక్షణ వ్యవస్థలు అందుబాటులో ఉండవన్నారు.

ప్రస్తుతం తనిష్క్, ఎంఎంఎంటీసీ పాంప్, అదిత్య బిర్లా క్యాపిటల్, ఫోన్‌పే, కారట్‌లేన్, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు డిజిటల్ గోల్డ్ అందిస్తున్నాయి. టాటా గ్రూప్‌కు చెందిన తనిష్క్ వెబ్‌సైట్‌లో "కేవలం రూ.100తో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం కొనుగోలు చేయవచ్చని" చెబుతూ కస్టమర్లను ఆకర్షిస్తోంది. ఎంఎంఎంటీసీ పాంప్ "ఎప్పుడు కావాలన్నా కొనండి, అమ్మండి, లేదా రిడీమ్ చేసుకోండి" అంటూ డిజిటల్ గోల్డ్ సౌకర్యాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే వీటిలాంటి ట్రస్టెడ్ బ్రాండ్లు కూడా విఫలమైతే పెట్టుబడిదారులకు చట్టపరమైన రక్షణ ఉండదని సెబీ హెచ్చరించింది.

ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు సురక్షితమైన, నియంత్రిత మార్గాలైన గోల్డ్ ఈటీఎఫ్‌లు , ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్, ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అయ్యే గోల్డ్ డెరివేటివ్ కాంట్రాక్టుల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని. ఇవన్నీ సెబీ పరిరక్షణలో ఉండటంతో పెట్టుబడిదారుల నిధులు సురక్షితంగా ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం నియంత్రణ లేని పెట్టుబడి మార్గాలను నిరుత్సాహపరుస్తూ, ఇన్వెస్టర్లు సురక్షితమైన మార్గాలను ఎంచుకోవాలని సూచిస్తోంది.



## రక్తనాళాల్లో పూడికలు రాకుండా ఉండాలా? ఈ 5 పానీయాలు మీ కోసమే!

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మరణాలకు గుండె జబ్బులే కారణం
ధమనుల్లో కొవ్వు పేరుకుపోవడమే గుండెపోటుకు ప్రధాన హేతువు
కొన్ని సహజ పానీయాలతో ధమనుల్లో పూడికను నివారించవచ్చు
గ్రీన్ టీ, దానిమ్మ రసం, బీట్‌రూట్ జ్యూస్ గుండెకు ఎంతో మేలు
ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు ఈ పానీయాలు తీసుకోవాలి
ఇవి కేవలం నివారణకే, ఇప్పటికే ఉన్న సమస్యలకు వైద్యులను సంప్రదించాలి

ఆధునిక జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఈ మహమ్మారి కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. గుండె జబ్బులకు ప్రధాన కారణాల్లో ఒకటి ధమనుల్లో (ఆర్టరీలలో) 'ప్లాక్' పేరుకుపోవడం. ఈ కొవ్వు పదార్థాలు రక్త ప్రసరణకు అడ్డుగోడగా మారి, గుండెపోటు వంటి ప్రాణాంతక సమస్యలకు దారితీస్తాయి.అయితే, జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ముప్పును చాలా వరకు నివారించవచ్చు. బరువును అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం చాలా ముఖ్యం. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన సహజ పానీయాలు కూడా ధమనుల్లో ప్లాక్ ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. ఈ పానీయాలు రక్తనాళాల్లో కొత్తగా ప్లాక్ ఏర్పడకుండా నివారిస్తాయే తప్ప, ఇప్పటికే పేరుకుపోయిన కొవ్వును తొలగించలేవు.

**1. గ్రీన్ టీ**

గ్రీన్ టీలో 'కాటెకిన్స్' అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ (%ాణూ%) స్థాయిలను తగ్గించి, ఆక్సిడేటివ్ ఒత్తిడిని నియంత్రిస్తాయి. తద్వారా ధమనుల్లో ప్లాక్ ఏర్పడటాన్ని అడ్డుకుంటాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (%చీ×ూ%) పరిశోధన ప్రకారం, రోజూ 2-3 కప్పుల గ్రీన్ టీ తాగడం వల్ల రక్తనాళాల పనితీరు మెరుగుపడి, రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. మంచి ఫలితాల కోసం చక్కెర లేకుండా తాగడం ఉత్తమం.

**2. దానిమ్మ రసం**

గుండె ఆరోగ్యానికి దానిమ్మ ఒక వరం లాంటిది. దీని రసంలో ఉండే ప్యూనికలగిన్స్, యాంథోసైయనిన్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు రక్తనాళాలను వాపు, ఇతర రుగ్మతల నుంచి కాపాడతాయి. సైన్స్‌డైరెక్ట్ పరిశోధనల ప్రకారం, రోజూ ఒక కప్పు దానిమ్మ రసం తాగడం వల్ల ధమనుల్లో ప్లాక్ వృద్ధిని నివారించవచ్చు. కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్‌ను అడ్డుకోవడం ద్వారా ఇది గుండెకు రక్షణ కల్పిస్తుంది.

**3. బీట్‌రూట్ రసం**

బీట్‌రూట్‌లో ఉండే నైట్రేట్లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారతాయి. ఈ నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను రిలాక్స్ చేసి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉండి, ధమనులు గట్టిపడకుండా ఉంటాయి. రోజూ బీట్‌రూట్ రసం తాగడం వల్ల కొలెస్ట్రాల్ జీవక్రియ కూడా మెరుగుపడుతుంది.

**4. పసుపు పాలు**

పసుపులో ఉండే 'కుర్కుమిన్' అనే సమ్మేళనానికి అద్భుతమైన యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది ధమనుల్లోని ప్లాక్‌ను స్థిరంగా ఉంచి, అది దెబ్బతినకుండా చూస్తుంది. పసుపు పాలలో చిటికెడు నల్ల మిరియాల పొడి కలుపుకుని తాగితే, శరీరం కుర్కుమిన్‌ను సులభంగా గ్రహిస్తుందని %ావీజ% పరిశోధనలు చెబుతున్నాయి. ఇది ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి గుండెను కాపాడుతుంది.

**5. మందార టీ (హిబిస్కస్ టీ)**

మందార పువ్వులతో చేసే ఈ టీలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటును, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. మందార టీలోని యాంథోసైయనిన్స్ సహజంగా నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచి రక్త ప్రసరణను సులభతరం చేస్తాయి.

## రోజూ పైనాపిల్ తింటున్నారా? మీ శరీరంలో జరిగే అద్భుత మార్పులివే!

జీర్ణశక్తి నుంచి గుండె ఆరోగ్యం వరకు.. పైనాపిల్‌తో అన్నీ!
రోజూ ఓ ముక్క పైనాపిల్.. ఆరోగ్యానికి తిరుగులేని భరోసా
మీ డైట్‌లో పైనాపిల్.. నిత్య యవ్వనానికి, ఆరోగ్యానికి కీలకం

చూడగానే నోరూరించే పైనాపిల్ పండు కేవలం రుచికి మాత్రమే పరిమితం కాదు. దాని వెనుక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. రోజూ కొద్ది మోతాదులో పైనాపిల్ తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడటం నుంచి రోగనిరోధక శక్తి పెరగడం వరకు మన శరీరంలో అనేక సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ పండును మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు చూద్దాం.

**జీర్ణవ్యవస్థకు మేలు:**

భోజనం తర్వాత కడుపు భారంగా అనిపించే వారికి పైనాపిల్ ఒక మంచి మిత్రుడిలా పనిచేస్తుంది. ఇందులో ఉండే "బ్రోమెలైన్" అనే ఎంజైమ్ ప్రోటీన్లను విచ్ఛిన్నం చేసి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. బయో రిసోర్స్ టెక్నాలజీ రిపోర్ట్స్ ప్రకారం, ఈ ఎంజైమ్ పోషకాలను శరీరం గ్రహించేలా ప్రోత్సహిస్తుంది. దీనిలోని ఫైబర్ కడుపు ఉబ్బరం తగ్గించి, జీర్ణవ్యవస్థను సమతుల్యంగా ఉంచుతుంది.

**పెరిగే రోగనిరోధక శక్తి:**

పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఒక కప్పు పైనాపిల్ ముక్కలు మన రోజువారీ విటమిన్ సి అవసరంలో సగానికి పైగా అందిస్తాయి. ఇది రోగనిరోధక కణాలను బలోపేతం చేస్తుంది. అలాగే, బ్రోమెలైన్ శ్లేష్మాన్ని తగ్గించి, జలుబు లేదా అలర్జీల సమయంలో ఉపశమనాన్ని కలిగిస్తుందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి.

**చర్మ సౌందర్యం, బరువు నియంత్రణ:**

క్రమం తప్పకుండా పైనాపిల్ తినడం వల్ల కొన్ని వారాల్లోనే మీ చర్మంలో తేడాను గమనించవచ్చు. ఇందులోని విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని బిగుతుగా, మృదువుగా ఉంచుతుంది. యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు, మచ్చలను నివారిస్తాయి. అధిక నీటిశాతం, ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని కలిగించి, బరువు నియంత్రణకు దోహదపడతాయి. తక్కువ కేలరీలు ఉండటం వల్ల తియ్యటి పదార్థాలు తినాలనే కోరికను ఇది తగ్గిస్తుంది.



**వాపులు, కండరాల నొప్పులకు చెక్:**

పైనాపిల్‌లోని బ్రోమెలైన్‌కు వాపులను తగ్గించే గుణం ఉంది. వ్యాయామం తర్వాత కలిగే కండరాల నొప్పులు, వాపుల నుంచి ఇది ఉపశమనం కలిగిస్తుంది. శరీర అలసటను తగ్గించి, త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించి గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

**ఎప్పుడు, ఎంత తినాలి?:**

పైనాపిల్‌ను ఉదయం లేదా మధ్యాహ్నం పూట తినడం ఉత్తమమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. భోజనం తర్వాత తింటే జీర్ణక్రియకు మరింత సహాయపడుతుంది. అయితే, రాత్రిపూట దీనికి దూరంగా ఉండటం మంచిది. రోజుకు 100 గ్రాముల పైనాపిల్ (కొన్ని ముక్కలు) తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

**ఎవరు జాగ్రత్తగా ఉండాలి?**

యాసిడ్ రిఫ్లక్స్, అల్సర్లు ఉన్నవారు పైనాపిల్‌కు దూరంగా ఉండాలి. దీనిలోని ఆమ్లత్వం ఎసిడిటీ సమస్యను పెంచవచ్చు. అలాగే, మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి. చిన్న చిన్న ఆరోగ్యకరమైన అలవాట్లే దీర్ఘకాలంలో మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ కొన్ని పైనాపిల్ ముక్కలు తినడం అలాంటి ఒక మంచి అలవాటు.

## 70 వేల రూపాయల్లో దొరికే బెస్ట్ అండ్ మైలేజ్ బైక్స్ ఇవే..!



రొటీన్ కమ్యూటింగ్ కోసం తక్కువ బడ్జెట్లో బైక్ కొనడం అంత ఈజీ కాదు. అలాంటి వారికి రూ.70వేల లోపు బడ్జెట్లో ఎకానమీ కలిగిన బైకులను ఏఏ కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయో తెలుసుకోవటం ముఖ్యం. 2025లో ఈ ప్రైస్ రేంజ్ లో 28 టూ వీలర్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రముఖ మోడల్స్ హీరో HF డీలక్స్, TVS స్పోర్ట్, OLA S1 Z, హోండా షైన్ 100 వంటివి ఉన్నాయి. హీరో HF డీలక్స్ ధర సుమారు రూ.57వేల 988గా ఉంది. ఇది సూపర్ లైట్వెయిట్, ఇంకా మైలేజ్ సుమారు 70 కి.మీ/లీటర్ ఇచ్చే వాహనంగా ప్రసిద్ధి పొందింది. బడ్జెట్‌లో ఉండే వారు దీన్ని మొదటి ఎంపికగా పెట్టుకోవచ్చు. దీని తర్వాత TVS స్పోర్ట్ రూ.61వేల294 రేటుకు అందుబాటులో ఉంది. ఇది దైనందిన ప్రయాణానికి అనువైనదిగా 80 కి.మీ/లీటర్ మైలేజ్ అందిస్తోంది. ఇక ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలా నుంచి OLA S1 Z కూడా రూ.59వేల 999కు బడ్జెట్లో అందించబడుతోంది. ఇంకా హోండా షైన్ 100 రూపాయి రూ.63వేల511 రేటుకే లభిస్తోంది. ఇది మంచి పవర్, రిలయబిలిటీ కలిగి ఉంటుంది. దీని తర్వాత %ఖీూ% రెడియన్ రూ.69వేల734 లో వేగవంతమైన షాఫ్ట్ గూడ్స్ అందిస్తుంది. అలాగే హీరో ప్లెచర్ ప్లస్ రూ.68వేల050 రేటుకే అందించబడుతోంది. ఎక్కువగా 70వేల రూపాయల బడ్జెట్లో 100 నుంచి 110 సీసీ వాహనాలే అందించబడుతున్నాయి. ఇవి మంచి మైలేజ్ తో పాటు మెరుగైన మెయిన్‌టెనెన్స్ ఖర్చులు తగ్గిస్తాయి. మీరు బడ్జెట్‌లో మంచి ఎఫిషియెంట్ మోబిలిటీ కోరుకుంటే.. ఈ 28లో కొన్ని టూ వీలర్స్ మీకు నిలకడైన, ఆర్థికంగా ఎక్కువ భారం కలిగించని ఆప్షన్ కావచ్చు. బైక్ కొనేటప్పుడు ధర, మైలేజ్, పర్ఫార్మెన్స్ తో పాటు మీరు ఎక్కడ ప్రయాణం చేస్తారో కూడా పరిగణలోకి తీసుకోవటం చాలా ముఖ్యం. అలాగే ఏ అవసరం కోసం తీసుకుంటున్నారు అనే విషయం కూడా ఇక్కడ బండి ఎంపికకు ముఖ్యమైనదిగా గుర్తించండి.

# నాగార్జున- జాకీ ష్రాఫ్ మధ్య ఈ కనెక్షన్ గురించి తెలుసా?





అక్కినేని నాగేశ్వరరావు నటవారసుడిగా కింగ్ నాగార్జున తన తండ్రి లెగసీని ముందుకు నడిపించడంలో విజయవంతం అయ్యారు. నేడు టాలీవుడ్ మూల స్థంభాలలో ఆయన ఒకరు. అగ్ర కథానాయకుడిగా దశాబ్ధాల పాటు పరిశ్రమను ఏలిన నాగార్జున సినీనిర్మాతగాను తనదైన ముద్ర వేసారు. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేతగా విజయవంతమైన వ్యాపారవేత్తగా, ఎంటర్ ప్రెన్యూర్ గాను సత్తా చాటారు.అయితే కింగ్ నాగార్జున నటుడు ఎలా అయ్యారు? ఆయన మొదటి సినిమా ఎంపిక వెనుక ఎవరున్నారు? అతడికి బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ తో ఉన్న కనెక్షన్ ఏమిటి? ఇవన్నీ తెలుసుకుంటే అభిమానులకు నిజంగా బిగ్ సర్ ప్రైజ్. అసలు నాగార్జున %-%విక్రమ్%-% సినిమాని ఎంపిక చేసినది - అక్కినేని నాగేశ్వరరావు. ఇదే సినిమాతో బాలీవుడ్ లో జాకీ ష్రాఫ్ కూడా డెబ్యూ నటుడిగా ఆరంగేట్రం చేసాడు. ఒకే సమయంలో ఒకేసారి నాగార్జున, జాకీ ష్రాఫ్ ఆరంగేట్రం చేయడం అప్పట్లో ఒక పెద్ద విషయం. ఎయిటీస్ క్లాస్ హీరోల్లో ఇప్పటికీ జాకీ ష్రాఫ్ నాగార్జునకు కనెక్ట్ అయి ఉన్నారు. అతడు నాగార్జున, చిరంజీవి, వెంకటేష్ లాంటి నటులకు అత్యంత సన్నిహితుడు.కింగ్ నాగార్జునకు %-%విక్రమ్%-% సినిమా ఆశించిన విజయాన్ని ఇవ్వలేదు. ఆ తర్వాత అతడు మజ్ను, జానకి రాముడు, విక్కీ దాదా లాంటి హిట్ చిత్రాల్లో నటించాడు. రామ్ గోపాల్ వర్మతో %-%శివ%-% సినిమా ట్రెండ్ సెట్టర్ గా మారింది. ఈ సినిమా కల్ట్ క్లాసిక్ హిట్ గా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆర్జీవీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున స్వయంగా అన్నపూర్ణ బ్యానర్ లో నిర్మించిన ఈ చిత్రం దర్శకహీరోలిద్దరికీ బిగ్ బ్రేక్ నిచ్చింది.కెరీర్ ఆరంభం ఎన్నో స్ట్రగుల్స్ ఎదుర్కొన్న నాగార్జున, జాకీ ష్రాఫ్ వారు ఎంపిక చేసుకున్న క్రాఫ్ట్ లో మాస్టర్స్ అయ్యారు. ఇద్దరూ ప్రయోగాత్మక పంథాలో కెరీర్ ని నడిపించారు. జాకీ ష్రాఫ్ సహాయనటుడిగా, హీరోగా వైవిధ్యమైన పాత్రలతో మెప్పించారు. ఒక నటవారసుడిగా తెరంగేట్రం చేసినా నాగార్జున ప్రయోగాల బాటలో తనదైన మార్క్ వేస్తూ ఇండస్ట్రీ బెస్ట్ హీరోగా నిరూపించారు.





# టాప్ - 10 భారీ బడ్జెట్ చిత్రాలివే ..

ఈ మధ్యకాలంలో ఒక సినిమా తెరకెక్కించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఎందుకంటే ఒకప్పుడు కోటి మించకుండానే సినిమాలు తీసి రెట్టింపు లాభాలను అందుకునేవారు నిర్మాతలు. కానీ ఇప్పుడు హై బడ్జెట్ సినిమాలు తీసినా కూడా ఆ సినిమాలు హిట్ అవుతాయా లేదా అని నిర్మాతలకు భయం పట్టుకుంది. అలా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఒకరిని చూసి మరొకరు ఎక్కువ బడ్జెట్ పెట్టి సినిమాలు తీస్తూ.. బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడుతున్నారు.అయితే ఇప్పటివరకు మన ఇండియన్ సినిమాల్లో హైయ్యేస్ట్ బడ్జెట్ పెట్టిన సినిమాలు ఏమేమి ఉన్నాయి అనేది ఇప్పుడు చూద్దాం..



**కల్కి 2898AD:**

ఇప్పటివరకు వచ్చిన ఇండియన్ సినిమాల్లో హైయ్యేస్ట్ బడ్జెట్ పెట్టిన మొట్టమొదటి మూవీ కల్కి 2898 ఏడి.. వైజయంతి మూవీస్ బ్యానర్ లో తెరకెక్కిన ఈ సినిమాకి ఏకంగా 600 కోట్ల బడ్జెట్ పెట్టారు. నాగ్ అశ్విన్ డైరెక్షన్లో వచ్చిన ఈ మూవీలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్,దీపికా పదుకొనే లాంటి దిగ్గజ నటులు నటించారు. అలా వీరి రెమ్యూనరేషన్లకే సగం బడ్జెట్ పోయింది అంటారు.

**ఆర్ఆర్ఆర్..**

దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా మూవీ ఆర్ఆర్ఆర్.. ఈ మూవీలో ఎన్టీఆర్,రాంచరణ్ లు నటించడంతో సినిమాకి భారీ హైప్ వచ్చింది. అలా ఈ సినిమాకి 550 కోట్ల బడ్జెట్ పెట్టారు.

**ఆది పురుష్..**

రామాయణ ఇతిహాస కథ ఆధారంగా తెరకెక్కిన ఆది పురుష్ మూవీకి ఏకంగా 550 కోట్ల బడ్జెట్ పెట్టారు.ఇందులో ప్రభాస్ రాముడి పాత్రలో నటించడంతో సినిమాకి ఎంత బడ్జెట్ అయినా సరే అని పెట్టేశారు.కానీ చివరికి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. అలా నిర్మాత చాలా కోట్లు నష్టపోయారు.

**రోబో 2.0..**

రజినీకాంత్ హీరోగా వచ్చిన రోబో సినిమాకు సీక్వెల్ గా రోబో 2.0 తెరకెక్కింది.అయితే రోబో మూవీకి మంచి రెస్పాన్స్ రావడంతో 2.0 కి కూడా భారీ అంచనాలు ఉన్నాయి. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. అలా ఈ మూవీకి ఏకంగా 550 కోట్లు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

**పుష్ప-2:**

సుకుమార్ డైరెక్షన్లో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప2 కి 500 కోట్ల బడ్జెట్ పెట్టారు.. పుష్ప మూవీకి సీక్వెల్ గా వచ్చిన పుష్ప-2 ని భారీ అంచనాలతో తీసుకువచ్చి బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద హిట్ కొట్టారు. అలా ఈ సినిమా దాదాపు 1800 కోట్ల కలెక్షన్స్ సాధించింది.

**ది గోట్ :**

తమిళ హీరో విజయ్ దళపతి హీరోగా వచ్చిన ది గోట్ మూవీలో ఈయన ద్విపాత్రాభినయం చేశారు. ఈ మూవీ కి మిక్స్ టాక్ వచ్చినప్పటికీ నిర్మాతలకు నష్టం రాలేదని తెలుస్తోంది. ఇక నిర్మాతలు ఈ మూవీకి 380 కోట్ల బడ్జెట్ పెట్టారు.

**బ్రహ్మాస్త్ర :**

బాలీవుడ్ సెలెబ్రెటి కపుల్ రణ్బీర్ కపూర్, అలియా భట్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన బ్రహ్మాస్త్ర మూవీకి ఏకంగా 350 కోట్ల బడ్జెట్ పెట్టారు.ఈ సినిమాలో విఎఫ్ఎక్స్ ని ఎక్కువగా వాడడం వల్ల ఇంత బడ్జెట్ ఖర్చయిందని అంటారు. త్వరలోనే ఈ మూవీకి సీక్వెల్ కూడా రాబోతోంది.

**గేమ్ ఛేంజర్:**

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన గేమ్ ఛేంజర్ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయం పాలైంది.ఈ సినిమాకి ఏకంగా 350 కోట్ల బడ్జెట్ పెడితే కనీసం 200 కోట్లు కూడా దాట లేదని ఇన్సైడ్ వర్గాల టాక్. అలా గేమ్ ఛేంజర్ వల్ల నిర్మాతలు భారీగా నష్టపోయారు.

**కూలీ:**

రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన కూలీ మూవీకి కూడా దాదాపు 350 కోట్ల బడ్జెట్ పెట్టారు. ఈ సినిమాలో నాగార్జున,ఉపేంద్ర లాంటి దిగ్గజ నటులు కూడా నటించడంతో సినిమాకి భారీ హైప్ ఏర్పడింది.కానీ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన లభించింది. అయితే సినిమా మిక్స్ టాక్ తో కూడా 500 కోట్ల కలెక్షన్స్ దాటేసింది.

**వార్-2**

ఎన్టీఆర్ మొట్టమొదటి బాలీవుడ్ ఫిల్మ్ వార్ 2.. హృతిక్ రోషన్,ఎన్టీఆర్ కాంబోలో వచ్చిన వార్-2 మూవీ 350 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కినప్పటికీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సాధించలేకపోయింది. ఈ సినిమాకి చాలా వరకు నష్టం వచ్చింది.

అలా మన భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు హైయ్యేస్ట్ బడ్జెట్ పెట్టిన సినిమాలలో టాప్ 10 సినిమాలు ఇవే. అయితే ఇంతకంటే ఎక్కువ బడ్జెట్ తో త్వరలోనే మరో రెండు సినిమాలు రాబోతున్నాయి. అవే బాలీవుడ్ లో వస్తున్న రామాయణ..పాన్ వరల్డ్ లో వస్తున్న ఎస్ఎస్ఎంబి 29.. ఈ సినిమాలో బాలీవుడ్ నుండి వస్తున్న రామాయణ మూవీకి ఏకంగా 2000 కోట్ల బడ్జెట్ పెట్టగా.. మహేష్ బాబు నటిస్తున్న ఎస్ఎస్ఎంబి 29 మూవీకి 1200 కోట్ల బడ్జెట్ పెడుతున్నారట.